# మెరుపు కథలు

## శాంతారామ్



# గుప్పిట్లోగాలి

ఆ ఊరి మిరపచేలు ఎరుపు రంగు తిరిగే కాలమది. చేలగట్ల వెంట వేసిన బంతిచెట్లు పూల బరువుకు వంగుతుంటే అప్పుడప్పుడు వీచే పడమటిగాలి రైతులకు కొత్తరువుతును గుర్తు చేస్తోంది.

ఆ ఊరిని పట్నానికి కలిపే మట్టి రోడ్డు ఓ కొండని గెండుగా చీల్చి దాని ఉసురుపోసుకుంది. ఆ రోడ్డు మీదగా కూలీలు వలస పోతారు-వట్టిపోయిన పశువులు కసాయి సంతకు నడిచివెళ్తాయి-పంటలు పట్నంలోకి చేరతాయి. ఆ రోడ్డుమీదగానే పల్లెకు న్యూస్ పేపర్లు వస్తాయి-బ్యాలట్ బాక్సులొస్తాయి. నాగరికతకు ఊడిగం చేసే ఆ మట్టిరోడ్డును పల్లె మొగన పలకరింపచేది ఓ శివాలయం.

వెలవెలబోయే శివాలయం ఆ రోజు స్వామీజీరాకతో చిన్న తిరణాలగా మారింది. ముదుర ఎరుపు రంగు గోడల మధ్య కాషాయ దుస్తుల స్వాములవారు మిరపచేలో బంతిమొక్కలాగే ఉన్నారు.

దబ్బపండులాంటి ఛాయ-ఎత్తయిన బుగ్గలు-నుదుటి మీద రూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టు- గిరజాల జుట్టు- అన్ని దేవుళ్ళ రూపాలూ కలబోసినట్టు స్వామీజీ చిద్విలాసంగా నవ్వుతున్నారు. పెద్ద రైతులు ముందు కూర్చుని సేవిస్తుంటే, బిదాబిక్కి దూరంనుంచే దర్శనభాగ్యం పొందుతున్నారు. వచ్చేవాళ్లు వస్తుంటే వెళ్ళేవాళ్ళు వెళ్తున్నారు.

ఓ ముసలమ్మ ఆఖరువరకు ఉంది. కాళ్ళలో సత్తువ సన్నగిల్లినా చెట్టులా అంతసేపూ నిలబడే ఉంది. ఏ భావం కానరాని ఆమె చూపుల్లో ఓర్పు గూడు కట్టుకొంది.

ఆమె ముఖాన బొట్టు లేదు. గల గలమనడానికి గాజుల్లేవు. బతుకును మించిన భక్తి ఒకటే ఉంది. స్వామీజీ పాదాలకు మొక్కరిల్లింది. ఆయన కూర్చోమని సైగ చేశారు.

"స్వామీ నాకు ఒకడే కొడుకు" ఆమె చెప్పసాగింది.

రావిచెట్టు మీద గుడ్లగూబ ఎగిరిపోయింది.

"ఆ అర్థమైంది" అన్నారు స్వామి.

స్వామికి ఏమి అర్థమయిందో అడిగే మూర్ఖురాలు కాదామె.

"వాడికసలు దేవుడంటే నమ్మకం లేదు. పాతికేళ్ళొచ్చినా ఆపాటి జ్ఞానమే లేదు" తల్లి ఫిర్యాదు చేసింది.

ఆమె చెప్పిందంతా స్వామి సావధానంగా విన్నారు.

"వాణ్ణి మీరే దారికి తేవాలి స్వామీ" ప్రాధేయ పడిందామె.

"నీ కొడుక్కి దురలవాట్లున్నాయా?"

"ఏమీ లేవు స్వామీ. చద్దనం తిని సైకిల్‌మీద పట్నంపోతాడు. పొద్దస్తమానం మిల్లులో చాకిరీ చేసి రాత్రికి వస్తాడు. నెల తిరిగే సరికి రెక్కల కష్టమంతా నా చేతుల్లోనే పోస్తాడు. దేవుడంటే మండి పడతాడు"

దూరంగా రైలు కూసింది. స్వామీజీ భృకుటి ముడిపడింది.

"పట్నంలో బస్సుల మధ్య లారీల మధ్య సైకిల్ తొక్కుతాడు. పురుగూపుట్రా, గాలీ ధూళీ దాటుకుంటూ ఇంటికొస్తాడు. ఏ రోజు ఏమవుతుందోనని నాకు ప్రాణం విలవిల్లాడుతుంది. ఇవాళిక్కడికి మీరొచ్చారని చెప్పి రమ్మని బ్రతిమాలినా రానంటే రానన్నాడు."

"పాపీ చిరాయువు" స్వామి కోపంగా అన్నారు.

తల్లి మనసు కలుక్కుమంది.

"నీకు దేవుడు కావాలా? ఇటువంటి కొడుకు కావాలా?" స్వామీజీలోని జ్ఞానం పురి విప్పింది.

తల్లి మనసు తల్లడిల్లింది. అదేమి ప్రశ్న అని ఆమె ఆ మహానుభావుణ్ణి అడగలేకపోయింది.

"చేసుకున్నవారికి చేసుకున్నంత. నీ భక్తే నీకు మోక్షమిస్తుంది." స్వామీజీ మాటలు ఆమె ఆలోచనల్ని భగ్నం చేశాయి.

"తలిదండ్రులు, చేసుకున్న పాప పుణ్యాలు వాళ్ళ పిల్లలకు కూడా చెందుతాయంటారు కదా స్వామీ" అమాయకంగా ప్రశ్నించింది. పల్లెలో అప్పుడే ఈనిన ఆవు "అంబా" అని అరిచిన చప్పుడు శివాలయంలో ప్రతిధ్వనించింది.

"కావచ్చు" స్వామీజీ జ్ఞాన ఝురి మలుపు తిరిగింది.

"నా కొడుకును మార్చలేరా?" తల్లి ఆశగా అడిగింది.

"పరమేశ్వరుడు తల్చుకొంటే ఏమైనా చేయగలడు" భారం దించుకున్నారు స్వామి.

"తమరు కన్పించే దేవుడు. మిమ్మల్నే వేడుకొంటున్నాను."

స్వామి భారం పెరిగింది.

* * *

చీకటి కడుపునదాగి ఊరు నిదరోయింది. మిరపచేల పై చల్లిన మందు వాసనకు గాలి కలవరిస్తోంది. దూరంగా రైలు కూత లీలగా విన్పిస్తోంది. పట్నంలో ఫ్యాక్టరీ వేసిన సైరను పల్లెకు చేరకముందే సుప్తమయింది. దేవుడా? కొడుకా? అని స్వామీజీ వేసిన ప్రశ్న కీచురాళ్ళ

## ప్రశ్న

అసంఖ్యాకప పుష్పాలని
మేమే భరిస్తున్నామని
విర్రవీగే కొమ్మల్లారా

మిమ్మల్ననుక్షణం
కంటికి రెప్పలా సంరక్షించి
మీకండగా నిలిచేది
కాండం

మరది కూడా మీ విధమే
అపార్థం చేసుకుని
అహంభావానికి లోనైతే

ఎన్నాళ్ళనుంచో
మీ కోసమే త్యాగం చేస్తూ
అజ్ఞాతవాసం గావిస్తూ
అట్టడుగునే పడి ఉన్న
వేళ్ళ మాటేమిటి....?

—అలిశెట్టి ప్రభాకర్



చప్పుడుతో మిళితమై భయంకరంగా విన్పిస్తోంది. కలత నిద్రలో తల్లి తుళ్ళిపడింది. సైకిలు బెల్లు విన్పించిన భ్రాంతిలో కళ్ళు తెరచుకుంటున్నాయి.

అర్థరాత్రయినా కొడుకు రాలేదు. తలిలేచి కూర్చుంది. పాడుమనసు కీడు శంకించింది. ఆమె తెల్లవార్లూ దేవుణ్ణి తలచుకొంది. అయినా భయమే జయించింది. తెల్లవారుజామున పెరిగిన చలి, భయంతో చేతులు కలిపింది. నులక మంచమ్మీద వణుకుతున్న తల్లి పట్నం గురించి ఆలోచించింది. పట్నం ఎవరి గురించీ ఆలోచించలేదు.

తెల్లవారింది. సైకిలు రాలేదు. కొడుకొచ్చాడు. చేతికి తెల్లటి కట్టు. కళ్ళు పీక్కుపోయాయి. భయంతో అప్పటికే బిక్కచచ్చిపోయిన తల్లి మరింత బిగదీసుకుపోయింది.

"నిన్న మిల్లులో పట్టీ తీస్తుంటే చెయ్యి తెగింది. నాలుగు కుట్లు పడ్డాయి. చలిలో ఇంటికి రాలేక రాత్రి మిల్లులోనే పడుకున్నానమ్మా."

రెండు పొట్టల కోసం వీడి రెండు చేతులు ఎంత కష్టం చేస్తున్నాయో అనుకోలేదు తల్లి, "దేవుడిలా పరీక్షిస్తున్నాడు" అనుకొంది. "వీడికి త్వరగా పెళ్ళిచేయాలి" అని నిర్ణయించుకొంది.

* * *

యంత్రాలు రాక్షసంగా తిరుగుతున్నాయి. ప్రజల కోసం మిల్లు పాటుపడుతోంది. గోదమీది బల్లులు పురుగుల్ని మింగుతున్నాయి. బస్తాలు మోస్తున్న కూలీల స్వేదాన్ని వేరుసెనగలు రుచిచూస్తున్నాయి.

అది వేసవి కాలపు సాయంత్రం. ఎండ చల్లిపోయిన నిప్పులు మండుతున్నాయి. మిల్లులో ఓ మూల భగ్గుమంది. చుట్టుముట్టిన మంటల మధ్య మిల్లు చరమ గీతం పాడుతోంది. కుర్రకారు కూలీలంతా ఒక్క ఉదుటున బైటపడ్డారు.

మిల్లు తగలబడుతోంది.అంతా బైటికొచ్చారు. వేరుసెనగ బస్తాలూ, వయసు మళ్ళిన నలుగురు కూలీలు తప్ప. బస్తాలు మోసి అలిసిన కూలీల గొంతులు మంటల్లో కూరుకుపోతున్నప్పుడు ఓ పాతికేళ్ళ కుర్రాడు బాణంలా లోపలికి దూసుకెళ్ళాడు. పల్లెటూళ్ళో,పగటి కలలో తల్లి కలవరింత అతనికి వినపడలేదు. మంటలు ఎంతకూ ఆరలేదు. రాత్రికి ఐదు శవాలు కమిలిపోయి బైటపడ్డాయి.

ఓ తల్లికి ఆ రాత్రి కాళరాత్రి. ఓ రెండు కళ్ళల్లో ఉప్పెనలు. సగం కాలిన తన సగం ఆత్మను తల్లి గుర్తించింది.

ఊరు ఉసూరుమంది. "దేవుడు లాంటోడు పాపం. ఎవర్ని ఏమీ అని ఎరగడు" అనుకున్నారు రైతులంతా.

"పాపం! ఆ తల్లిని ఎవరు చూస్తారో" అని అమ్మలక్కలు జాలిపడ్డారు.

జాలి లేని కాలం గిర్రున తిరిగింది. మిరప పంటలు ఎరుపు రంగు తిరగవలసిన సీజను అది. వానలు సరిగ్గా పడక జొన్న చేల్లో చొప్పదంట్లు మాత్రమే పండాయి. అంతంత మాత్రంగా ఎదిగిన మిరప తోటల్ని పురుడు నాకేసింది.

పక్షుల కూతలు బలహీనంగా విన్పిస్తున్నాయి. ఆ ఊరికి పట్నానికి కలిపేరోడ్డు మాత్రం అలాగే ఉంది. ఆ రోడ్డు మీదుగా అద పడుచులు అత్తవారిళ్ళకు వెళ్తూనే ఉన్నారు. కొత్త కోడళ్ళు పల్లెకు వస్తూనే ఉన్నారు. ఏటా వచ్చే స్వాములవారు మళ్ళీ అదే రోడ్డు మీదగా నడిచొచ్చారు.

శివాలయంలో రావి చెట్టు సగం ఎండి పోయింది. ఓ పిచ్చి తల్లి ఊరంతా తిరిగి ఆలయాని కొచ్చింది. స్వామీజీకిచ్చేందుకు ఈసారి చేతిలో పళ్ళు లేవు. చెట్టంత కొడుకేలేడు. కడుపు డొక్కకు అతుక్కుపోయింది.

"స్వామీ! దేవుడు చచ్చిపోయాడు" పిచ్చితల్లి గొంతు పెగిలింది. కడుపు మరింత లోపలికి పోయింది.

స్వామీజీ ఇచ్చిన అరటిపండు తిని ఆ బీద తల్లి మళ్ళీ వేసిన కేకకు ఊరు ప్రతిధ్వనించింది. ఈదురు గాలికి శివాలయం తలుపులు మూసుకుపోయాయి. ●


రాయల్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూలు

స్థాపితం: 1985

కరెన్సీనగర్, రామవరప్పాడు రింగ్ రోడ్, విజయవాడ

కొత్త అడ్మిషన్లు

తెలుగు మీడియం: నర్సరీ నుండి **X th** క్లాసు వరకు
ఇంగ్లీషు మీడియం: **LKG** నుండి **7th** క్లాసు వరకు
[ S. C. E. R. T. ]

సుశిక్షితులయిన, వృత్తికి అంకితమైన గ్రాడ్యుయేట్ కేరళ ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తారు.

రెసిడెన్షియల్ విద్యార్థులు: అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయబడినవి. విద్యార్థుల బాగోగులు చూడడానికి వీలుగా ఉపాధ్యాయులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు.

రెసిడెన్షియల్ మరియు నాన్ రెసిడెన్షియల్ కోసం దరఖాస్తులు స్కూల్ ఆఫీసులో ఉ॥ 11 గం॥ నుండి సా॥ 5-00 వరకు లభిస్తాయి.

గమనిక: కరాటే మరియు నృత్యానికి సంబంధిత తరగతులు రెగ్యులర్‌గా నిర్వహించబడతాయి.

ముఖ్యోద్దేశం: క్రమశిక్షణాయుత విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత

కరస్పాండెంట్: ఎస్.ఎస్. రెడ్డి